
# పునరావాసం




**ఆంధ్రభూమి, 5 ఏప్రిల్ 1997**

మదర్ సీరియస్ స్టార్ట్ ఇమిడియట్లీ అని వున్న టెలిగ్రాం కాగితం మూర్తి చేతుల్లో రెపరెపలాడుతోంది.

మానవ సంబంధాలమీద మూర్తికి గొప్ప నమ్మకం. మనిషికీ, మనిషికీ మధ్యని డబ్బనేది అడ్డుగోడలా వున్నా దానికి ట్రాన్స్పరెన్సీ వచ్చేది మానవ సంబంధాలవల్లేనని అతననుకుంటాడు.

అతన్లో చిన్న జెర్క్... తనింత పాజిటివ్‌గా ఆలోచిస్తున్నప్పటికీ తల్లి తనెందుకు నమ్మలేక పోతోంది? ఎక్కడో? ఏదో పొరపాటు జరుగుతోంది. అదేమిటో తను తెలుసుకోలేకపోతున్నాడు.

'టెలిగ్రాం చేతలో పెట్టుకుని ఆలోచనలో పడ్డారేమిటి? తర్వాతి కార్యక్రమం ఏమిటో చెప్పండి' అంది అతని భార్య ప్రమీల.

'తొమ్మిదింటికి బస్సు. దాంట్లో వెళ్తాను'. జవాబిచ్చాడు మూర్తి.

'ఈసారేనా గట్టిగా చెప్పి ఆవిణ్ణి మీతో తీసుకుకొచ్చెయండి. ఒక్కరూ అక్కడెందుకు?' అంది ప్రమీల. ఆమె ఎప్పుడూ ఆ ఒక్కమాటే బయటకంటుంది. అలా అనలేనివి చాలా వున్నాయి.

తల్లికి ఎప్పుడూ ఏదో ఒక అనారోగ్యగం. రోజులు లెక్కపెట్టుకుంటూ వుంటుంది. వాస్తవానికి ఆవిడకంత వయసు లేదు. ఒక్కర్తీ వండుకు తినడంచేత మనసులో కొంత అశాంతి. అదే ఆవిడ అనారోగ్యానికి మూలకారణం.

మొదట్లో యిద్దరూ అక్కడికే ట్రాన్స్ఫర్ చేయించుకుని వెళ్ళిపోదామనుకునేవారు. అనుకోకుండా తమ డిపార్టుమెంటు హౌసింగ్ సొసైటీలో తనకి ప్లాటు ఎలాటైంది. ఆ తర్వాత తమ కాలనీ మంచి సెంటర్ పాయింటైంది. ఆ వుండీలేని యింటి కోసం ఈ ప్లాటు అమ్ముకోవడం అర్థంలేనిదనిపించింది. ఇక్కడే యిల్లుకట్టుకుని సెటిలైపోయారు. ఇంక అక్కడికి వెళ్ళడం కానిపని.

★★★

మూర్తి వెళ్ళేసరికి యశోదమ్మ మంచానికతుక్కునిపోయి వుంది. పక్కింటావిడే యింత జావకాచి రెండు పూటలా పోస్తోందట. తల్లి ధైర్యం ఏమిటో మూర్తికర్థం కాలేదు. అతన్ని చూడగానే యశోదమ్మ కళ్ళల్లో జ్యోతులు వెలిగాయి.

'ఎలా వుందమ్మా?' ఆవిడ పక్కలో కూర్చుంటూ అడిగాడు.

'రెండ్రోజుల్నించీ జ్వరంరా' బలహీనంగా వున్న గొంతుకతో చెప్పింది.

'నే వచ్చానుగా! ఇంక తగ్గిపోతుంది' మూర్తి ధైర్యం చెప్పాడు.

'ఏమోయ్ మూర్తీ! కులాసాయా? ఇంకా ఏముందనయ్యా యీవిడ యీ ఇల్లు పట్టుకుని

వేళాడుతోంది? మీ యింటికి తీసికెళ్ళిపో. మీ ఆవిడగానీ, వద్దంటోందా ఏమిటి?" అంటూ పక్కింటాయన వచ్చాడు.

"మా ఆవిడ గురించి నాకన్నా మా అమ్మ చెప్తేనే బావుంటుంది బాబాయ్!" అన్నాడు మూర్తి.

'మరేమమ్మా, వదినా! హాయిగా కొడుకు దగ్గరకెళ్ళి కృష్ణా, రామా అంటూ దర్జాగా కాలక్షేపం చెయ్యక యీ పాతిల్లుపట్టుకుని అవస్థపడ్తావు? అక్కడ పెద్దదే కట్టాడుటకదా, మూర్తి? కట్టకేం చేస్తాడు? మొగుడూ పెళ్ళాలిద్దరూ వుద్యోగస్తులాయిరి. నీ బరువా వాళ్ళకి లేదు. మూర్తి అత్తారివైపు నుంచీ కాస్తోకూస్తో కలుస్తూనే వుంది. ఏవోయ్, మూర్తీ! మీ అత్త మీ దగ్గిరే వుంటోందా?" ఆయన చెప్పిన సలహాకీ, వేసిన ప్రశ్నలకీ, చెప్పుకున్న జవాబులకీ అన్నింటికీ కలిపి మూర్తి ఒక్క నవ్వుమాత్రం నవ్వేడు.

తనూ ప్రమీలా వుద్యోగాల కెళ్ళిపోతారు. పిల్లల్ని చూసుకోవడానికి ఎవరో ఒకరు కావాలి. దేవుళ్ళా అత్తగారొచ్చి ఆదుకుంది. ఆవిడా వితంతువే. దేవుడు ఎక్కడో సర్దుబాట్లు చెయ్యడానికి యింకెక్కడో లోటు లుంచుతాడు. ఇదీ అంతే!

"ఎంత పెద్దిల్లు కట్టినా ఎన్ని సదుపాయాలున్నా అది వాడిల్లు. నాకు యిక్కడున్న స్వతంత్రం అక్కడుంటుందా?" నెమ్మదిగా అంది యశోదమ్మ. ఆవిడెప్పుడూ అలా స్పష్టంగా చెప్పలేదు. ఈసారెందుకో బయటపడిపోయింది. ఎందుకేమిటి? కొడుకుతో వెళ్ళిపోవాలన్న ప్రలోభం మనసుని పీకుతుంటే దాన్ని వెనక్కి లాగుతున్న భయం యీ బలహీన క్షణంలో తనని తను విజేతగా ప్రకటించేసుకుంది.

మూర్తి కంగుతిన్నాడు. అతనికి నవ్వూ వచ్చింది తేరుకున్నాక, అది తనిల్లూ. యిది ఆవిడిల్లూనా? ఇదన్నమాట. అమ్మ భయం. అక్కడ తనమాట నెగ్గదు. కోడలికి వొదిగి వుండాలని వెరుపు. కానీ ప్రమీలది అలాంటి మనస్తత్వం కాదు. ఒకవేళ అలాంటి మనిషే అయినా, యీవిణ్ణి సాధించేంత టైము ఆమెకెక్కడిది? ప్రమీల... సన్నగా, పొట్టిపొడుగూ కాని ఎత్తులో పక్కవాళ్ళకే వినిపించినంత నెమ్మదిగా మాట్లాడే ప్రమీల. గాజుల శబ్దానికీ, మువ్వల సవ్వడికీ కూడా డిస్టర్బయ్యేంత ప్రశాంతంగా వుండే ప్రమీల.. అమ్మని సాధించడం... నవ్వాపుకోలేక గట్టిగానే నవ్వేసాడు.

"ఏమిట్రా?" అనడిగింది తల్లి తెల్లబోతూ.

"నీ మాటలకి. అది నా యిల్లూ, యిది నీ యిల్లూనా? నేనే నీ శరీరంలోంచీ భాగంగా పుట్టుకొచ్చినవాణ్ణి. నాకున్నవి నీవి కావా? నా భార్య నీ కోడలు కాదా? నా పిల్లలు నీ మనవలు కారా?"

"ఏమోమరి అంత దూరం ఎప్పుడూ ఆలోచించలేదు" నీరసంగా కళ్ళు మూసుకుంది మూర్తి తల్లి.

"ఇప్పుడాలోచించు. ఇదే నీ అభ్యంతరమైతే మరే ఆలోచనా లేకుండా రావచ్చు. ప్రమీల గురించి నీకు తెలుసు" అన్నాడు మూర్తి. ఆవిడ చేతిని తన చేతిలోకి తీసుకుని వేళ్ళు సవరించాడు. చీపురు పుల్లల్లా వున్నాయవి. అతనికి చాలా బాధేసింది.

'చూడు, చూసేవాళ్ళు లేక నిన్ను నవ్వు పట్టించుకోవడం మానేసావు. ఎంత చిక్కిపోయావో!" అన్నాడు ప్రేమగా.

'ప్రమీలా వాళ్ళమ్మ?'

'ఆవిడ మా దగ్గిరే వుంటోంది. మాకో మనిషితోడు కావాలిగా?'

'నే వస్తే ఆవిడ వెళ్ళిపోతే ప్రమీల కష్టపెట్టుకుంటుందేమో!''

"అలాంటిదేమీ వుండదు. అవన్నీ అక్కడికెళ్ళాక చూసుకుందాం. నిన్ను తీసుకు రమ్మని ప్రమీల కూడా పదేపదే చెప్పింది''.

"దాని మనసు బంగారం''

"ఇంకనేం?''

"ఈ ఇల్లమ్మేస్తావా?''

"ఇప్పుడంత అర్జెంటుగా దేనికి? నువ్వక్కడ యిమడగలవో లేదో చూసాక అప్పుడు ఆలోచిద్దాం''

"నీ యిష్టం''.

★★★

యశోదమ్మకి కొడుకింట్లో అంతా కొత్తకొత్తగా వుంది. పరాయిగా వుంది. ఇంట్లో వియ్యపురాలుంది. ఆవిడ యిల్లంతా స్వతంత్రంగా తిరుగుతోంది. పిల్లలావిణ్ణి వదలడం లేదు. ఆ స్థానం తనదని యశోదమ్మ మనసు ఘోష పెడ్తోంది.

యశోదమ్మ వియ్యపురాలు అనసూయ సరదాయైన మనిషి కలుపుగోలుగా వుంటుంది. వంటింట్లో కూతురికి సాయం చేస్తుంది. స్కూల్నుంచి రాగానే మనవల్ని కూర్చోపెట్టి హోమ్‌వర్కు చేయిస్తుంది. సాయంత్రం కూతురూ అల్లుడూ వచ్చేసరికి వేడివేడిగా టిఫెన్లు చేసి పెడ్తుంది. వంట వండేస్తుంది. ఎందులోనూ చిన్నతనం లేదు. తను యింత చేస్తున్నా అనసూయమ్మ కలగజేసుకోవటం లేదన్న బాధ లేదు.

'ఎక్కడుంటే అదే మనిల్లు. ఏం వదినా! ఒక్కదాన్నీ వుండలేక యిల్లు అద్దెకిచ్చేసి వీళ్ళదగ్గిరుంటున్నాను'' అంది. ఆవిడకి యిద్దరు కూతుళ్ళు. ఇంకో కూతురు కరీంనగర్లో వుంటోంది.

తనొచ్చింది గాబట్టి ఆవిడ వెళ్ళిపోతుందేమో ననుకుంది యశోదమ్మ. కానీ ఆవిడలాంటి ప్రయత్నం చెయ్యలేదు. ఇక్కడ ఆవిడకీ ప్రత్యేకంగా ఒక గదుంది. అందులో ఆవిడ ప్రపంచం యిమిడి వుంటుంది. ఎంబ్రాయిడరీ ఫ్రేము, పూలు, సూదులు, పుస్తకాలు...

గిలకలా తిరుగుతూ ఆవిడ చలాకీగా తిరుగుతుంటే అదే వయసులో వున్న తనెందుకిలా డీలా పడిపోయిందన్న ప్రశ్న యశోదమ్మలో తలెత్తింది.

★★★

ప్రమీలా, మూర్తి ఆఫీసులకెళ్ళారు. మనవలు స్కూలికెళ్ళారు. అనసూయ యేం చేస్తోందో తెలీదు. తనేమిటి, మన్నుతిన్న పాములా యిలా పడుకోవడం? అనిపించి లేచి యివతలకొచ్చింది యశోదమ్మ.

మూర్తి నాలుగొందల గజాల స్థలంలో ఇల్లు కట్టాడు. విశాలమైన కాంపౌండు. అందులో రకరకాల మొక్కలున్నాయి. వాటి మధ్య అనసూయ తుక్కంతా పోగుచేసి కంపోస్ట్‌పిట్‌లో వేస్తోంది.

అనసూయ - తన యీడుదే! తనలాగే అటు ఇటూ కాని వయసులో భర్తని కోల్పోయింది. తనకింకా కొడుకున్నాడు. ఆమెకిద్దరూ కూతుళ్ళే ఐనా అన్నీ వున్నట్టు సందడంతా మీద వేసుకుని తిరుగుతుంటే తనెందుకలా వుండలేకపోతోంది?

'రా వదినా! తోటపని చేస్తుంటే టైము తెలీటం లేదనుకో?'' అంది తలెత్తి చూసి ఆవిడ. యశోదమ్మ వెళ్ళి బావి చపటా మీద కూర్చుంది.

"మీవారు సర్వీసులో వుండగానే పోయారు కదా! నీకు జాబ్ రాలేదా?" కుతూహలంగా అడిగింది అనసూయని.

"ఇచ్చేవారే! నేనే వద్దన్నాను. అవసరం ఏముంది? డబ్బుకి యిబ్బంది లేదు. ఇహ వెళ్ళి ఎక్కడో వూడిగం చేసే బదులు నా కూతుళ్ళకి సాయంగా వుంటే పోదా అనిపించింది" చేతులు కడుక్కుని వచ్చి ఆమెకూడా ఆవిడకి ఎదురుగా బండమీద కూర్చుంది.

"ఇలా అంటున్నానని మరోలా అనుకోకు. వీళ్ళింట్లో వుంటున్నందుకు నీకెప్పుడూ ఏమీ అనిపించలేదా? మనింట్లో మనం వోపిక వుండో లేకో వుడకేసుకుని తిన్నది వేరు" మనసుని పట్టిపీకుతున్న సందేహాన్ని బయటపడేసింది యశోదమ్మ.

"ఎంతకాలం వంటరిగా వుంటాం చెప్పొదినా? ఈ వేళ పంతానికిపోయి అలా సాగించుకుంటామే అనుకో. రేపు వంట్లో వోపికవుడిగాక వీళ్ళు చేరదియ్యకపోతే? అవసరానికి ఒకళ్ళ అండని చేరడం కాదమ్మా, అనుబంధానికి చేరాలిగానీ ఏమాటకామాటే చెప్పుకోవాలి. అల్లుడుగారు మణిపూసనుకో. నాకిది పరాయింటిలా ఎప్పుడూ అనిపించలేదు" కొడుకుని అనసూయ పొగిడినందుకు చాలా ఆనందం కలిగింది యశోదమ్మకి.

వాడిది తన పెంపకం మరి! కించిత్తు గర్వంగా అనుకుంది కాసేపు యిద్దరి మధ్య మౌనం రాజ్యమేలింది.

"ఇలా వండుకుని తింటూ నిర్వ్యాపారంగా గడపడం చిరాగ్గా లేదొదినా?" వున్నట్టుంది అడిగింది అనసూయ.

"వున్నా ఏం చేస్తాం?"

"పెద్దవాళ్ళమని చెప్పుకోవడమేగానీ మనకేం వయసైపోయిందని? నాకింకా యాభై దాటలేదు. ఎంత లేదన్న యింకో యిరవయ్యేళ్ళయినా బ్రతుకుతాను. కాలం కర్పూరంలా కరిగిపోవాలి. లేదంటే కుందేలు పిల్లలా పరిగెత్తాలిగానీ!"

"నాకూ అదే విచిత్రంగా అనిపిస్తుంది. వారున్నప్పుడు క్షణం తీరిక కూడా దొరికేది కాదు. ఇప్పుడేమిటిలా? పొద్దేపోవటంలేదు? ఐనా నీ అంత ఆలోచన నాకు లేదమ్మా"

"అంత ఆలోచన లేకుండా ఎందుకు గడపాలి? మనమేం బండరాళ్ళమా?"

"బాగానే చెప్పావు. కానీ ఆలోచించి ఏం లాభం? మనం ఏం చెయ్యగలం? ఆ దేవుడి పిలుపుకోసం ఎదురు చూడ్డం తప్ప?"

"ఎందుకొదినా, యింత నిర్వేదం? చివరిదాకా తోడొస్తానన్న మనిషి మధ్యలోనే చెయ్యొదిలేసి వెళ్ళిపోయారు. వాళ్ళే ప్రపంచంగా బ్రతికిన మనం యిలా మిగిలాం. ఈ కాలమనే మహాసముద్రాన్ని ఈదాలి. అందుకేదో ఒక సాధనం కావాలి. వ్యాపకం వుండాలి. ఆడపిల్లల పెళ్ళిళ్ళూ, పురుళ్ళూ బాధ్యతలన్నీ తీరాయి. ప్రమీల పిల్లలు కూడా పెద్దయ్యారు. ఇప్పుడు మళ్ళీ తీరిక ఈ తీరిక నన్ను బాధిస్తోంది."

"నా వరకూ నాకు ఆ రోజులు కళ్ళముందు కదుల్తూనే వుంటాయి. నాకో చిన్న ప్రపంచం. అందులో కేంద్రబిందువుని నేనే. అందరూ నా చుట్టే తిరిగేవారు. అలాంటిది ఆయన పోయాక మాయలఫకీరు వెళ్ళిపోయాక అతగాడు సృష్టించినవన్నీ మాయమయ్యినట్టు నేనొక్కదాన్నీ యథాతథంగా మిగిలిపోయాను."

"యథాతథంగా కాదు, అన్నీ కోల్పోయిన కాందిశీకుల్లా మిగిలిపోయాము. ఈ ప్రపంచం చాలా విశాలమైంది. చాలా... ఎందుకంటే మనకన్నీరు తుడవడానికి ఏ చెయ్యీ ముందుకి రాదు. వచ్చినా మన చెంప అందదు. మధ్యలో ఎన్నో అవాంతరాలు. అలాగే మనలాంటి

వాళ్ళెందరో! మన చుట్టూ వున్న వాళ్ళు మాత్రం ఎన్నాళ్లని సానుభూతి చూపిస్తారు? అందుకని కన్నీళ్ళు దిగమింగి మనంతట మనమే ముందుకి సాగాలి. తప్పదు".

ఒకే నావలో ప్రయాణిస్తున్న ఈ యిద్దరాడవాళ్ళకీ ఆలోచనల్లో సాపత్యం రావడం లేదు. భర్త చావుతో బ్రతుకే ముగిసిపోయిందని ఒకళ్ళనుకుంటే అక్కణ్ణుంచే కొత్తమలుపు మొదలైందని రెండోవాళ్ళు అనుకుంటున్నారు. ఒకేలాంటి పరిస్థితుల్లో కూడా మనోభావాల వైరుధ్యం!

అనసూయ మాటలు యశోదమ్మకి అర్థమయ్యీ కానట్టుగా వున్నాయి. ఆమె మనసులో ఏమైనావుండవచ్చుగాక, మాటల్లో ఆమె ఎన్నేనా చెప్పవచ్చు గాక, తనూ తన విషయం చెప్పుకోవాలనిపించింది. "నాక్కిక్కడికి రావటం అస్సలిష్టంలేదు వదినా! వారు లేని బాధ నా గుండెల్ని నిత్యం కెలుకుతూనే వుంటుంది. కళ్ళు నీటిచెలమలౌతాయి. పెళ్ళాం పిల్లల్తో నిశ్చింతగా బ్రతుకుతున్న మూర్తి సంసారంలోకి ఒక రాయిలా వచ్చిపడి అల్లకల్లోలం రేపడం యిష్టంలేదు" అంది.

"నువ్వు దుఃఖం దుఃఖమని అనుకుంటున్నది. వాస్తవానికి దుఃఖం కాదొదినా! భార్యాభర్తలిద్దరూ కట్టకట్టుకుని ఒకేసారి పోరు. ఒకరు ముందు... ఒకరు తర్వాత... ఇది అనివార్యం. సామాజిక ధర్మాన్ని శాశించే జీవధర్మం ఇది. శరీరం వర్తమానంలోంచీ భవిష్యత్తులోకి వెళ్తుంటే మనసు గతంలోకి జారుకుంటే ఎలా? దాన్ని వర్తమానంలోకి లాక్కురావాలి" అంది అనసూయ.

"...."

"ఒక రకంగా మనం అదృష్టవంతులం. పెన్షనొస్తుంది. ఒకళ్ళకి భారం కాకుండా యింత తినగలుగుతున్నాం. కానీ వదినా... ఇన్ని నీకు చెప్తున్నా, నాకూ నీకులాగే బాధ వుంది. నిన్ను వేధించిన ప్రశ్నలే నన్నూ వేధిస్తుంటాయి. జవాబుదారీ నేను తీసుకోను. కాలానికొదిలేసాను. కాలానికి...." చివరి మాటలంటున్నప్పుడు అనసూయ గొంతు జీరవోయింది. క్రమేపీ అది దుఃఖంలోకి దింపింది. మోకాళ్ళలో తలదాచుకుని ఏడ్చేసింది.

యశోదమ్మకీ దుఃఖం పెల్లుబికి వచ్చింది. కానీ నిభాయించుకుంది ఓదార్పుగా ఆమె భుజంమీద చెయ్యేసింది. కాసేపటికి ఆమె తేరుకుంది.

"ఎప్పట్నుంచో యిలా కరువుతీరా ఏడవాలనుంది. మనని అర్థం చేసుకునే వాళ్ళదగ్గిర ఏడవాలనిగానీ పిల్లలు బెంబేలుపడ్డం తప్ప ఏం అర్థం చేసుకుంటారు? ఇన్ని చేస్తున్నా అమ్మేడుస్తోందనుకుని యింకేదో చెయ్యబోతాడు. కానీ అవేవీ మనకక్కర్లేదు. మనక్కావల్సినది వాళ్ళివ్వలేరు. ఈ అగడ్తని పూడ్చలేక వాళ్ళు గిజగిజలాడిపోతారు. ఇన్నాళ్ళకి నా మనసులో భావాలన్నీ చెప్పుకోవడానికి నువ్వు దొరికావు" అని కళ్ళు తుడుచుకుని లేచి "సినిమాకెళ్దామా?" అనడిగింది.

"సినిమాకా?" యశోదమ్మ తెల్లబోయింది. భర్తపోయాక ఆవిడని రమ్మన్నవాళ్ళెవరూ లేరు.

"ఆ! అశోకాలో మంచి సినిమా ఆడుతోంది. పావుగంట టైముందింగా. చప్పుని వెళ్తే అందుకుంటాం. నీ చీర బాగానే వుంది. నేను మార్చుకుని వచ్చేస్తాను. నువ్వు అట్నుంచీ తలుపులన్నీ వేసెయ్యి" అంటూ లోపలికెళ్ళింది అనసూయ.

యశోదమ్మకి అనేకమైన సందేహాలు. కొడుకేమనుకుంటాడో? కోడలేమనుకుంటోందో? అన్నీ పక్కని పెట్టి ఏమైతే అయిందని బయల్దేరింది.

ఎవరూ ఏమీ అనుకోలేదు. పైగా మూర్తి సంతోషించాడు. "ఇక్కడికొచ్చాక అమ్మలో మార్పొచ్చింది కదూ!" అని భార్యతో పదేపదే అన్నాడు.

అనసూయ ఏ ఉద్దేశంతో పనిగట్టుకుని తనతో అందోగానీ ఆ మాటలన్నీ యశోదమ్మ చెవుల్లో ప్రతిధ్వనిస్తూ తనూ అందర్లాగా... ముఖ్యంగా అనసూయలాగ గడపాలన్న చిన్న కోరికని రేపాయి. యాక్టివ్‌గా తిరుగుతూ... పనులు చేసుకుంటూ...

ఈ మధ్య తనకి తరుచుగా వచ్చే అస్వస్థతలు దూరమయ్యాయని కూడా గమనించింది. కొత్తతరహాలో బ్రతకడంపట్ల ఆమెకి మక్కువ పెరిగింది.

★★★

"నేను తిరిగి మనింటికి వెళ్ళిపోవాలనుకుంటున్నాను ప్రమీ! అల్లుడికి చెప్పు" హఠాత్తుగా అంది అనసూయ.

ఆవిడ చెప్పింది ప్రమీలకైతే రెస్పాన్స్ యశోదమ్మ దగ్గర్నుంచీ వచ్చింది. "అదేమిటలా? నేనొచ్చాననా? అలాంటివేం మనసులో పెట్టుకోవద్దు. నువ్వున్నావుగాబట్టి నేను ఈ పాటేనా యిక్కడ నిలదొక్కుకోగలిగాను. లేకపోతే రెండో రోజునే తిరుగు ప్రయాణమయ్యేదాన్ని" అంది.

అనసూయ నవ్వింది. నవ్వి అంది. "ఇన్నాళ్ళూ అంటే ప్రమీల పిల్లలు చిన్నవాళ్ళు. వాళ్ళు పెద్దాళ్ళయ్యారు. నువ్వు రావాల్సిన చోటికి వచ్చావు. ఇద్దరు పెద్దాళ్ళం వుండి ఇక్కడ చేసే పన్లేం ఉంటాయి? మా యింటికి తిరిగెళ్ళిపోయి..." అని అర్థోక్తిగా ఆగిపోయింది.

ప్రమీల యింత మొహం చేసుకుంది తల్లి వెళ్ళి పోతాననేసరికి కానీ అత్తగారొచ్చి వుండగా ఆవిణ్ణి వుండమని ఎలా అడగ్గలదు? కోడలి మొహంలో భావాలని చదివింది యశోదమ్మ. తన అంతరంగంలోకి తొంగి చూసుకుంది. "అలా అనకు వదినా!" అని బ్రతిమాలింది.

మూర్తి కలగజేసుకున్నాడు. లోపలి గదుల్లో జరుగుతున్న ఈ సంభాషణంతా అతను విన్నాడు. "మీ యింటికి వెళ్ళిపోయి ఏం చేద్దామని?" అనడిగాడు. "ఒక్కర్తీ వుంటూ మా అమ్మ ఎలా తయారైందో చూసారుగా? ఇప్పుడు మీ వంతా? అమ్మ వుంటుంది. మీరూ వుండండి. ఇద్దరికీ చెరోగది వుండనే వుంది" అన్నాడు.

భర్త ఆ పాటి మద్ధతునిచ్చేసరికి ప్రమీలకి సంతోషమైంది. 'పిల్లలు నీకు బాగా చేరికయ్యారు. నువ్వు లేకపోతే నా మాటవిననే వినరు. మేం ఆఫీసులకెళ్ళిపోయాక నువ్వు మా అత్తగారూ చక్కగా కబుర్లు చెప్పుకోవచ్చు. పచ్చీసాడుకోవచ్చు. ఆవిడకీ సరదాగా వుంటుంది. నీకూ పొద్దు పోతుంది. ఒక్కదానివీ వండుకు తింటూ... ఎందుకమ్మా?" అంది.

"నీ పిల్లలు పెద్దాళ్ళయిపోయారు. స్కూలుకెళ్ళొచ్చి చక్కగా కూర్చుని టిఫిన్ తిని హోమ్‌వర్కు చేసుకుంటున్నారు. వాళ్ళ బెంగలేదు. వాళ్ళ మామ్మకదే అలవాటుపడతారు. కానీ నాకే అక్కడికెళ్ళి...." "మళ్ళీ ఆగిపోయింది అనసూయ"

"అక్కడికెళ్ళి?" మూర్తి రెట్టించాడు. అనసూయ సంకోచంగా చూసింది చూసి అంది "బుర్ర దయ్యాలకొంపలా వుంది, సరైన వ్యాపకంలేక. నలుగురు పిల్లల్ని పోగుచేసి క్రెచ్‌లాంటిది పెడ్దామని... ఎప్పట్నుంచో వుంది యిలాంటి ఆలోచన. ఇదంటే అలవాటైపోయిన పని. నీ పిల్లల్ని పెంచాను. విమల పిల్లల్ని పెంచాను" అంది అనసూయ.

"గుడ్ అయిడియా" అన్నాడు మూర్తి ప్రశంశగా.

దానిమీద చాలాసేపు తర్జనభర్జనలు జరిగాయి. మూర్తి ఉత్సాహంగా చర్చలో పాల్గొన్నాడు. అతినికెంతసేపూ అత్తగారి వెనక తల్లిని కూడా తిప్పుదామని వుంది.

ఆఖరికి ప్రమీలంది. "అమ్మా! క్రెచంటే మూడేళ్ళలోపు పిల్లలే వుంటారు. వాళ్ళకోసం ఆయాల్ని పెట్టుకోవడం... వాళ్లకేదేనా వస్తే కంగారు పడ్డం... యివన్నీ రిస్కు... అదీగాక ఈ

రోజుల్లో క్రెచ్‌లు చాలా వున్నాయి. పెద్దపెద్ద ఆఫీసుల్లో గవర్నమెంట్ పెడ్తోంది. ఒక్క పని చేస్తే బావుంటుంది"

"ఏమిటది?" మూర్తి ఉత్సాహంగా అడిగాడు.

"పోయి నేడు పిల్లలకి సెలవులిచ్చినప్పుడు చాలా అవస్థపడ్డాం. నువ్వేమో విమలకొడుక్కి వంట్లో బాలేకపోతే కరీమ్‌నగర్ వెళ్ళావు. ఆ రెండు నెలలూ నెల మూర్తీ నెల నేనూ లీవుపెట్టుకుని యింట్లో వున్నాం. మాకంటే ఆ వొక్కేడే. మా కొలీగ్స్ చాలా మంది వున్నారు. వాళ్ళకి ప్రతి సమ్మరూ గండమే" అంది ప్రమీల.

"నిజమే. మా దగ్గరున్న లేడీ ఎంప్లాయిస్ కూడా అలానే అంటారు" అన్నాడు మూర్తి.

"సమ్మర్ రెండు నెలలూ, దసరా సెలవులకీ, అలా సెలవుల్లో పనిచేసేలా పిల్లల క్లబ్ పెడదాం" అంది ప్రమీల.

"పెద్దపిల్లలైతే చెప్పిన మాట వినరు కదే! పైగా పడి దెబ్బలు తగిలించుకుంటారు" అభ్యంతరంగా అంది అనసూయ.

"నో ఔట్‌డోర్ ప్లేయింగ్. కేరమ్సు, చెస్సూ, ఛెయినీస్ చక్కర్... ఇండోర్ గేమ్సు...బుక్సూ...' అంది ప్రమీల.

"ఇదేదో బానే వుంది. ఏడాదంతా కష్టపడక్కర్లేదు" మూర్తి ఎంకరేజి చేసాడు.

"ఇద్దరూ కలిసి అనసూయని పంపిచేస్తారా ఏమిటి?"

గాభరాగా అడిగింది యశోదమ్మ.

"ఆవిడెక్కడికీ వెళ్ళరు. అన్నీ యిక్కడే. నువ్వూ ఆవిడా కలిసి చేస్తారు" అన్నాడు మూర్తి.

ఒక పెద్ద వెల్లువేదో తనని ముంచెత్తుతున్నట్లనిపనించింది యశోదమ్మకి. అన్నీ అయిపోయానుకున్న తనికి యివన్నీ ఏమిటో! వద్దనేస్తే? అనసూయన్నట్టు యింకో పదిహేనేళ్ళో యిరవయ్యేళ్ళో ఎలా గడపాలి? ప్రతీక్షణాన్ని బ్రతుకువాకిట్లోంచీ బలవంతంగా గెంటేస్తూ? అబ్బో తనక్కూడా కవిత్వం వస్తోందే! అనుకుంది. అది నిస్సంశయంగా కవిత్వం కాదు. భావప్రకటన. రేపుమీద ఆశ పుట్టిన ఆమె మనసు చేస్తున్న భావ ప్రకటన.